## క్లుప్తంగా

### మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



రంగాపురంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

**బేతంచెర్ల:** కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనాలు నడపద్దని సీఐ డీ. వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని రంగాపురం గ్రామంలోని మద్దిలేటి స్వామి ఆలయ ముఖ ద్వారం వద్ద గ్రామస్తులు, వాహనదారులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. గ్రామాలు, పట్టణం, స్కూలు పరిసర ప్రాంతాల్లో వెళ్లేటప్పుడు నిర్ణీత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదాల నివారణపై కౌన్సెలింగ్



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య

**బనగానపల్లె రూరల్:** మద్యం సేవించి వాహనాలు నడుపరాదని నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం మండలంలోని నందివర్గం గ్రామంలో ఆటో డ్రైవర్లకు, ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

### పేరుసోములలో టీస్టాల్ దగ్ధం



ఎగిసిపడుతున్న మంటలు

**సంజామల:** మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా టీ స్టాల్, దాని పక్కన ఉన్న సిట్టింగ్ రూం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన వడ్డె మధు అనే వ్యక్తి టీ స్టాల్‌లో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో అందరూ చూస్తుండగా షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో టీ స్టాల్, దాని పక్కనున్న సిట్టింగ్ రూం కాలిపోయాయి. దాదాపు రూ.లక్ష నష్టం కలిగి ఉంటుందని బాధితుడు వాపోయాడు.

### ప్రాచీన ఆలయ పరిశీలన



ఆలయాన్ని సందర్శించిన తహసీల్దార్ అనిల్, పురావస్తుశాఖ అధికారి మహేంద్ర నాయుడు

**సంజామల:** మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో ఓ ఇంటి కింద శివాలయం బయట పడ్డ విషయం తెలిసిందే. ఈమేరకు తహసీల్దార్ అనికుమార్, పురావస్తు శాఖ అధికారి మహేంద్ర నాయుడు శనివారం పేనుసోములకు చేరుకుని ఆలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ మాట్లడుతూ..పురావస్తు శాఖ అధికారులు మరోసారి తనిఖీ నిర్వహించిన తరువాత వివరాలు వెల్లడిస్తామన్నారు. ఆలయం పైన ఎన్ని సంవత్సరాల క్రితం ఇళ్లు నిర్మించారన్న సమాచారం సేకరించమని చెప్పారు.

### చీరల పంపిణీ

**డోన్ :** పట్టణంలోని డాక్టర్ సుందర్‌సింగ్ కాలనీకి చెందిన నాలుగు నిరుపేద ముస్లిం కుటుంబాలకు ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు జాన్ ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### స్తంభం వేశారు.. కనెక్షన్ మరిచారు



రామిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో ఖాళీగా దర్శనమిస్తున్న స్తంభం

**సంజామల:** మండలంలోని రామిరెడ్డిపల్లె ఎస్సీకాలనీలో నూతన స్తంభాలు ఏర్పాటు చేసిన అధికారులు లైన్ ఇవ్వడం మరిచారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో దాదాపు ఆరు నెలల క్రితం నూతన స్తంభాలు ఏర్పాటు చేసినా ఇంతవరకూ పవర్ ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్ని సార్లు పంచాయతీ అధికారులు, విద్యుత్ అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బేతంచెర్లలో జోరుగా బంతిపూలు, మామిడి ఆకుల అమ్మకాలు



అమ్మకానికి ఉంచిన మామిడి కాయలు

# ఉగాది సందడి

**బేతంచెర్ల:** తెలుగు సంవత్సారాది ఉగాది సందర్భంగా స్థానిక మార్కెట్లు శనివారం కళకళలాడాయి. ఆదివారం జరుగునున్న పండుగకు అవసరైన నూతన వస్త్రాలు, పూలు, సరుకుల కోసం వివిధ గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి తరలివచ్చారు. దీంతో దుకాణాలుండే ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా అంగళ్ల బజారు, మెయిన్ బజారు, వస్త్రదుకాణాల ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. అయా గ్రామాల నుంచి విక్రయానికి తెచ్చిన బంతిపూలు, అరటి ఆకులు, మామిడిఆకులు, రంగులు, మామిడి కాయలు ఆయా కూడల్లో విక్రయాలకు ఉంచారు. అలాగే పశువులకు అలంకరించే వస్తువుల వద్ద రైతుల సందడి కన్పించింది.

**కిటకిటలాడుతున్న అవుకు సెంటర్**

**అవుకు:** ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా అవుకులోని పలు ఏరియాలు శనివారం జనాలతో కిటకిటలాడాయి. పండుగ సామగ్రి, నూతన వస్త్రాలు, కిరాణ సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు చుట్టు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి పెద్ద ఎత్తున వచ్చారు. ముఖ్యంగా మామిడాకులు, అరటి ఆకులు, కూరగాయలు అమ్మేవారు రోడ్డుపైనే అమ్మకాలు చేయడంతో సెంటర్, మార్కెట్ వీధి, బస్టాండ్ ఏరియాలు రద్దీగా మారాయి.

# ‘ఉపాధి’లో వెలుగు చూసిన అక్రమాలు

- 2023–24 ఉపాధి హామీ పనులపై బహిరంగ విచారణ
- రూ. 25 కోట్లతో పనులు
- రూ. 6,82,017 రికవరీకి ఆదేశం



బహిరంగ విచారణ చేస్తున్న అధికారులు

**ప్యాపిలి:** మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధి హామీ పనులపై బహిరంగ విచారణ చేపట్టారు. డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, ఏపీడీలు అన్వరా బేగం, నరసింహారెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ షీబారాణి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ మురద్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో చేపట్టిన పనులు గురించి వివరించారు. 31 గ్రామ పంచాయతీల్లో ఫాంపాండ్స్, సాగర్ ట్రెంచెస్, మినీ గోకులాలు, ఉద్యానవనాలు, పూడికతీత తదితర పనులకు గాను రూ. 25 కోట్లతో పనులు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. కలచట్లతో పాటు పలు పంచాయతీల్లో కూలీలు పనులకు వెళ్లకుండానే వారి పేరిట నిధులు దుర్వినియోగం జరిగినట్లు తేల్చారు. జలదుర్గంలో పాత పనులకే బిల్లులు చెల్లించినట్లు గుర్తించామని సోషల్ ఆడిట్ సభ్యులు తెలిపారు. పండ్లతోటల సాగులో కూడా మొక్కలు లేకపోయినా ఉన్నట్లు బిల్లులు చేశారని చెప్పారు. మండల వ్యాప్తంగా దాదాపు రూ.6,82,017 అవినీతి జరిగినట్లు గుర్తించిన అధికారులు తక్షణమే రికవరీకి ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీవోలు నర్సిరెడ్డి, వెంకటరమణ, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# అమావాస్య పూజలు



గాడుబావి వీరాంజనేయస్వామి

**బేతంచెర్ల:** పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయస్వామి, పలక చింతమాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల్లో పాల్గుణ మాస అమావాస్య సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామి కి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహా మంగళహారతి నిర్వహించారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో నిర్వాహకులు రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. అలాగే అంబాపురం గ్రామ సమీపంలోని ధర్మగిరి పీఠంలో వెలసిన శనీశ్వర స్వామి ఆలయంలో శనిత్రయోదశి పూజలు జరిపించారు.

# సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మున్సిపల్ కార్యాలయం తలుపులు మూసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

**డోన్ టౌన్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొయిలకోండ నాగరాజు,నక్కి శ్రీకాంత్ విమర్శించారు.ప్రజా చైతన్యయాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలంటూ శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడి 20 సంవత్సరాలు అవుతున్నప్పటికీ పేద,బడుగు,బలహీన వర్గాల కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలం చెందారన్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. ధర్నాకు కార్యాలయ సిబ్బంది స్పందించక పోవడంతో మున్సిపల్ కార్యాలయం తలుపులు వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేసారు. నాయకులు రామాంజనేయులు, భాస్కర్‌రెడ్డి, నాగమద్దయ్య, కుల్లాయప్ప తదితరులు ఉన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ



విద్యార్థులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తున్న సీఐ ఇంతియాజ్ బాషా

**కోవెలకుంట్ల:** ప్రమాదాలు చోటు చేసుకోకుండా వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ సూచించారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్‌లో ద్విచక్ర వాహన చోదకులు, ఆటోలు, జీపులు, తదితర వాహనాల డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ఆర్సీ, లైసెన్స్, ఇన్సురెన్స్, తదితర రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంజామల ఎస్ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- **డోన్ టౌన్ :** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల గమ్యస్థానాలకు సురక్షితంగా మనతో పాటు ఇతరులు కూడా క్షేమంగా వెళ్తారని సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సాయిశ్రీ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ హెల్మెట్ ఆవశ్యకత, డ్రంకెన్ డ్రైవ్,అతి వేగం,రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.

# వంతెన.. ప్రమాదపుటంచున!



శిథిలావస్థలో ఉన్న వంతెన

**సంజామల:** కోవెలకుంట్ల–తిమ్మనాయినిపేట ప్రధాన రహదారి పేరుసోముల బస్టాండ్ సమీపంలో వంతెన ప్రమాదపు అంచునకు చేరుకుంది. వారుపై ఆరు దశాబ్దాల క్రింతం నిర్మించిన వంతెన ప్రస్తుతం అధ్వాన స్థితికి చేరుకుంది. కొలిమిగుండ్ల మండలం ఎర్రమల్ల కొండ నుంచి వేచ్చే వరద నీరు సంజామల మండలంలో పేరుసోముల గ్రామంలో ఉన్న వాగు ద్వారా వచ్చి కుందు నదిలో కలుస్తుంది. వర్షకాలంలో ఈ వాగులో వరద నీరు నిత్యం ప్రవహిస్తూనే ఉంటుంది. వంతెన శిథిలావస్థకు చేరడం, నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో ఏదైనా భారీ వాహనాలు వెళ్లె సమయంలో ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలో దాదాపు పదుల సంఖ్యలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఫ్యాక్టరీలకు ముడిసరుకు వెళ్లాలన్నా.. అక్కడి నుంచి సిమెంట్ బస్తాలు తిరిగి రావలన్నా.. ఈ ప్రధాన రహదారి పైనుంటే భారీ వాహనాలు వెళ్లాలి. ప్రమాదం జరగకముందే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వాగుపై ఉన్న పురాతనమై వంతెన తొలగించి.. నూతన వంతెనను నిర్మించాలని గ్రామ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

**కొలిమిగుండ్ల:** ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలోని కుంటెమ్మ ఆలయం, ప్రధాన రహదారిలోని చౌడేశ్వరిదేవి ఆలయంతో పాటు బెలుం శింగవరంలోని వీరపాపులమ్మ ఆలయంతో పాటు పలు గ్రామాల్లోని గ్రామ దేవతల ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనున్నారు. కోటపాడులో చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం ఘనంగా చేయనున్నారు.

### విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**బనగానపల్లె రూరల్ :** కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ కమిటీలో పలువురు విద్యార్థులు చేరారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మరిచారన్నారు. జీవో నెం 117, జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని, 77, 107, 108 జీవోలను వెంట నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చందు, మహేష్, మనోజ్, రమేష్, చెర్రీ తదితరులు ఉన్నారు.

### సెలవు రోజుల్లోనూ బిల్లుల చెల్లింపునకు అవకాశం

**డోన్ టౌన్ :** విద్యుత్ బిల్లులు చెల్లించడానికి సెలవు రోజులైన ఆది,సోమవారాల్లో కూడా కార్యాలయం తెరచి ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ కమలాకర్‌రావు శనివారం తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో ఉగాది,రంజాన్ పండుగ రోజుల్లో కూడా బిల్లులు కట్టించుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వినియోగదారులు బకాయిలు లేకుండా చెల్లించాలని కోరారు.

### టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



బేతంచెర్లలో టీడీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**బేతంచెర్ల:** మండల కేంద్రంతో పాటు రహిమానుపురం గ్రామంలో శనివారం జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగుర వేశారు.

**డోన్ టౌన్ :** టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి తారకరామనగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి ఆదే కాలనీ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.




టీడీపీ జెండా ఎగురవేస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

**బనగానపల్లె రూరల్ :** స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి కేక్ కట్ చేసి, ఆ పార్టీ జెండా ఆవిష్కరించారు.

### పంచాయతీ వేలాలు వాయిదా

**బేతంచెర్ల:** స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 2025–26 సంవత్సరానికి సంబంధించిన దినసరి, వారపు సంత మార్కెట్, కమేళా బహిరంగ వేలాలు శనివారం జరగాల్సి ఉండగా వాయిదా వేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. వేలం ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**కోవెలకుంట్ల:** పట్టణంలోని రెండు ప్రదేశాల్లో శనివారం దాడులు నిర్వహించి 19 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ తెలిపారు. కోవెలకుంట్లలోని రెండు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్లు సమచారం అందటంతో ఏకకాలంలో దాడులు చేసి ఒక ప్రదేశంలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 72 వేలు, మరో చోట 10 మంది వద్ద రూ. 38,930 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో సంజామల ఎస్ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఆలయం ప్రధానగోపురం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి



లడ్డూ ప్రసాదం సిద్ధం చేస్తున్న దృశ్యం

**బనగానపల్లె రూరల్:** మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ శనివారం తెలిపారు. ఇప్పటికే భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయడంతో పాటు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని టెంట్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే భక్తులకు తాగునీటి సౌకర్యం , మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, స్నానపుగదులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులకు సుమారు 40 వేల వరకు లడ్డూ ప్రసాదాలను ప్రత్యేకంగా తయారు చేసి సిద్ధంగా ఉంచామన్నారు. ఇంకా దాతల సహకారంతో భక్తులకు మజ్జిగ నిమ్మ రసాయల పంపిణికి చర్యలు తీసుకుంటునట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం బనగానపల్లె ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**పూజా కార్యక్రమాలు..**

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, సాయంత్రం అంకురార్పణ, పంచాగశ్రవణం, పన్నేరపు బండ్లు తిప్పుట, ప్రాకార రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. 31న శ్రీ దేవి,భూదేవి సమేత చెన్నకేశ స్వామి కళ్యాణోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఏప్రిల్ 1న సాయంత్రం అమ్మవారి రాయబార మహోత్సవం, రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన, 2వ తేదీ అమ్మవారికి సహస్రనామార్చన, పసుపు కుంకుమ పట్టువస్త్రముల అలంకరణ, రాత్రి 12 గంటలకు భాస్కరయ్య ఆచారిచే అమ్మవారికి దిష్టిచుక్క పెట్టు కార్యక్రమం అనంతరం చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం, 3న సాయంత్రం అమ్మవారి రథోత్సవం(పోవడం), 4న రథోత్సవం (రావడం), 5వ తేదీ ఉదయం వసంతోత్సవంతో జ్యోతి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

### డ్రైవింగ్ కళాశాలను ప్రారంభించాలి

**ప్యాపిలి:** డోన్ మండలం కొత్తకోట వద్ద నిర్మించిన ప్రభుత్వ డ్రైవింగ్ కళాశాలను తక్షణమే ప్రారంభించాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో డ్రైవింగ్ కళాశాలను నిర్మించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే డ్రైవింగ్ కళాశాలను ప్రారంభించి డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించాలని కోరారు. కళాశాలను ప్రారంభించడం ద్వారా నిరుద్యోగులు డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసి డ్రైవర్లుగా స్థిరపడతారని పేర్కొన్నారు.

### 31న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

**సంజామల:** మండల పరిధిలోని కానాల గ్రామంలో ఈనెల 31న రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కూడాల చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి గల వృషభాల యజమానులు 31 వతేది ఉదయం 6 గంటల లోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.